చప్పున కరెంటు పోయింది. కరెంటు పోయిందీ అంటే ఒక పట్టాన రాదు మా ఊర్లో. ఆ మాటే అన్నాను నా మిత్రబృందంతో.

''చచ్చాంపో. రేపటి ఎగ్జామ్స్ బండి చక్రమే'' చప్పబడి పోయారు అప్పటివరకు సీరియస్‌గా చదువుతున్న అందరూ.

''పోనీ ఫోన్ చేసి లైన్ మాన్‌ని పిలిపిస్తే?''

''అవున్రా రవీ, మీ ఆఫీసరు గారింట్లో ఫోన్ వుందికదా, లెటజ్ ట్రై'' అంతా ఉత్సాహంతో అన్నారు.

నేనేం మాట్లాడలేదు.

ఆఫీసరుగారంటే నాకు ఎంతో గౌరవం. అంతటి నిజాయితీపరుడు ఈ రోజుల్లో వుండడం చాలా అరుదు. ఎంతో కరెక్టు మనిషి. ఎంతమంది ఆఫీసు జవాన్లు వున్నా వాళ్ళని ఇంటి పనికి ఉపయోగించడు. ఆఫీస్ జీప్ కూడా కరెక్టు టైంకి వచ్చి అతడ్ని ఆఫీసుకి తీసుకువెడుతుంది. ఇది మా వీధిలో వున్న ఆడంగులకు కష్టంగా వుండ న్నది నిర్వివాదాంశం. అంతకు ముందున్న ఆఫీసరుగారి భార్య మా వీధిలో వున్న ఆడాళ్ళనంతా జీప్‌లో ఎక్కించుకుని గుళ్ళు, గోపురాలకు తీసుకెళ్తూ వుండేది. ఇప్పుడా ఛాన్సే పోయిందని వాళ్ళ బాధ.

''మాట్లాడవేంరా? చీకట్లో చదివిన దంతా నెమరువేస్తున్నావా ఏం?''

''నాయనా రవీ, వచ్చి నీ కడుపున పుడతాం నాయనా, అడిగి పుణ్యం కట్టుకో, లేకుంటే అక్టోబరు దాడి తప్పదు నీ మీద, జాగ్రత్త సుమా'' మెత్తగా వార్నింగ్ ఇచ్చారు.

నిజమే, వీళ్ళంతా నా అతిథులు ప్రస్తుతం. పల్లెల నుండీ రోజు వచ్చి వెళ్ళలేక పరీక్షలు అయ్యే వరకు మా ఇంట్లోనే వుండడానికినిశ్చయించుకున్నారు. అందుకు మా పెద్దలు కూడా అంగీకరించారు. ఈ ఒక్క రోజు అయిందనిపిస్తే చాలు, ఎగ్జామ్స్ అయిపోతాయి. అందుకే ఆఫీసరుగారింటికి బయలుదేరాను, నా ఫ్రెండ్స్‌తో. తప్పదుకదా మరి.

మా ఇంటి నుంచి ఒక ఫర్లాంగు దూరంలో వుంది ఆఫీసరుగారి ఇల్లు. చుట్టూ అశోక వృక్షాలతో ఠీవిగా వుంది. ఎమర్జెన్సీ లైట్ బ్రైట్‌గా వెలుగుతోంది.

నేను అనుకొన్నట్టే జరిగింది.

''సారి, ఫోన్ డెడ్ అయింది'' అన్నాడు ఆఫీసర్. ఇంక మీరు వెళ్ళవచ్చు అన్నట్టుగా. మంచి నిద్రలో లేపామేమో ముఖంలో విసుగు స్పష్టంగా కనిపిస్తోంది.

ఎందుకో చాల తేలికగా ఊపిరి తీసుకున్నాను. నా ఫ్రెండ్స్ ఫెయిల్ అవుతారేమో అనే భయం కంటే, ఆఫీసరుగారి సిన్సియారిటీకి భంగం కలిగిస్తున్నానేమో అని దిగులుగా వుంది.

''ఆఫీసులకి ఆఫీసులే మింగేస్తున్న ఈ రోజుల్లో ఇలాంటివారు వుండడం సంతోషించవలసిన విషయం.. ......'' ఇంకా చెప్పబోతున్నాను.

''నోర్ముయ్, పదిమందికి సాయపడని మంచితనం ఎందుకు? అవకాశాన్ని ఉపయోగించుకోలేని చేతగాని వెధవ...'' ఇంకా ఎంతవరకు తిట్టేవాడోగాని, వాడి వాక్ప్రవాహానికి బ్రేకు వేశాను. నాకు మాత్రం అంత సిన్సియారిటీ వున్న ఉద్యోగి మా ఊళ్ళో వున్నందుకు చాలా గర్వంగా వుంది.

కిరోసిన్ బుడ్లతో, కొవ్వువత్తులతో తంటాలు పడుతున్నాం. అంతలో పెద్దగా కేకలు, పరుగెడుతున్న చప్పుళ్ళు వినిపించాయ్. మాద్దుము కదా ఆఫీసరుగారింట్లో నుంచే!

''అంత చీకటిగా వుందేం? ఎమర్జెన్సీ లైట్ వెలుగుతుండాలి, ఏమయిందో!'' గాబరాగా అన్నాను.

''చావనీ, చీకట్లో. తిక్క కుదురుతుంది'' మా వాళ్ళలో ఏం చలనం లేదు. ఆఫీసరుపట్ల నాకున్న గౌరవం నన్ను నిలవనీయలేదు. షర్టు వేసుకుని పరుగెత్తాను.

ఇల్లంతా చిమ్మ చీకటి. ఎక్కడో ఒకటి, రెండూ కొవ్వు వత్తులు వెలుగు తున్నాయి.

మా వీధి ప్రజలు కాంపౌండ్ గేటు లోనే ఎదురువచ్చారు. ఎవరో నలుగురైదుగురు వ్యక్తులు ఆఫీసర్ ఇంట్లో చొరబడి అందినంతవరకు చిన్న చిన్న వస్తువులు పట్టుకు పోయారట. ''కరెంటు లేకపోవటం బాగా సహకరించింది వాళ్ళకి'' అనుకుంటూ వెనుతిరిగాము.




రాత్రంతా మసక వెలుర్లో పోరాడి ఎప్పుడు నిద్రపోయామో, ఎక్కడి వాళ్ళమక్కడ పడివున్నాం.

తలుపు చప్పుడైతే తీశాను.

ఎదురుగా పోలీసులు??

''మిమ్మల్నందరినీ అరెస్టు చేస్తున్నాం.. ఆఫీసరుగారింట్లో మీరు దొంగతనం చేశారని ఆయన పోలీస్ రిపోర్టు ఇచ్చారు. ఇది గోండి వారంటు!''

ఎస్.ఐ. మాటలకి కత్తివాటుకు నెత్తుటిచుక్క లేకుండా పోయింది నా ముఖంలో

— గుజ్జర్లమూడి నిర్మలరాణి